క్లుప్తంగా

వైఎస్సార్‌టీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎడ్వర్డ్


తోట ఎడ్వర్డ్

దెందులూరు: వైఎస్సార్‌టీఎఫ్ ఏలూరు జిల్లా ఉపాధ్యక్షుడిగా దెందులూరుకు చెందిన తోట ఎడ్వర్డ్ ఎన్నికయ్యారు. వైఎస్సార్‌టీఎఫ్ జనరల్ సెక్రటరీ గెద్దం సుధీర్ ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు జరిగాయి. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు, సంఘ నాయకులు ఆదివారం తోట ఎడ్వర్డ్‌ను అభినందించారు.

కారు ఢీకొని పాల వ్యాపారి దుర్మరణం

దెందులూరు: కారు ఢీకొని పాలవ్యాపారి అక్కడికక్కడే మృతి చెందిన వైనమిది. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జంగారెడ్డిగూడెం నుంచి కారులో వస్తున్నవారు నిర్లక్ష్యంగా నడుపుతూ ఏలూరు నుంచి మేధినరావుపాలెం వెళ్తున్న పాల వ్యాపారి వీర్రాజును ఆదివారం జోగన్నపాలెం కనకదుర్గమ్మ గుడి వద్ద ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన వీర్రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మేధినరావుపాలెం సర్పంచ్ ఎం.దుర్గాకుమారి రాజు బంధువు వీర్రాజు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి హుటాహుటిన ఏలూరు ప్రభుత్వాసుపత్రికి వెళ్లారు. ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని ఉన్నారు.

ద్విచక్రవాహనంపై వెళ్తూ రోడ్డుపై పడి గాయాలు

దెందులూరు: జాతీయ రహదారిపై దెందులూరు–ఆశ్రం ఆసుపత్రి మధ్య ఏలూరుకు చెందిన హరీష్ ద్విచక్రవాహనంపై వెళుతూ ఆదివారం అకస్మాత్తుగా అదుపుతప్పి రోడ్డుపై పడ్డాడు. తలకు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. ఏలూరు మేయర్ గన్‌మెన్ సతీష్, దెందులూరు హెడ్‌కానిస్టేబుల్ గోపి బాధితుల వివరాలు అడిగి తెలుసుకుని ఏలూరు వైద్యశాలకు వారిని తరలించారు.

కథ చెబుతారా ఊ కొడతాం విజేతలు వీరే


విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): తిరుమల తిరుపతి దేవస్థానాలు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఏలూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో కథ చెబుతారా ఊ కొడతాం శీర్షికతో ధర్మ, అర్థ, కామ, మోక్ష సంబంధిత నీతి, భక్తి కథలపై ఆదివారం స్థానిక రామచంద్రరావుపేట శ్రీమత్ మార్కండేయ వేద పాఠశాలలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. జూనియర్స్ విభాగంలో కె.గీతామాధురి (శర్వాణి పబ్లిక్ స్కూల్) ప్రథమ, జె.రామ మాధవ్ (సీఆర్ రెడ్డి పబ్లిక్ స్కూల్) ద్వితీయ, కె.జోషిత (శర్వాణి పబ్లిక్ స్కూల్) తృతీయ, సీనియర్స్ విభాగంలో ఎ.వేద సరస్వతి (సీఆర్ రెడ్డి పబ్లిక్ స్కూల్) ప్రథమ, కె.దేవి (శర్వాణి పబ్లిక్ స్కూల్) ద్వితీయ, పీఎస్ఆర్ కార్తికేయ (కేంద్రీయ విద్యాలయం) తృతీయ బహుమతులు సాధించారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా మైలవరపు లక్ష్మీనరసింహం, ఎంవీఎస్ సత్యనారాయణ, ఎస్‌వీఎస్ఎస్ మూర్తి వ్యవహరించారు. అతిథులు విజేతలకు బహుమతులు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. హిందూ ధర్మ ప్రచార పరిషత్ టీటీడీ జిల్లా ప్రోగ్రామ్ అసిస్టెంట్ బీఎస్ఆర్ సుబ్రహ్మణ్యం కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ఐక్యంగా హక్కులు సాధించుకోవాలి

ఏలూరు(మెట్రో): కొప్పుల వెలమ కులస్తులు ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ క్యాంప్ కార్యాలయంలో పద్మశ్రీ, ప్రసాదరావు దంపతులను ఆదివారం ఉదయం ఏలూరులోని కొప్పుల వెలమ సంఘం నాయకులు మరడా అనిల్ కుమార్, కార్పొరేటర్ కిలాడి దుర్గారావు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు మాట్లాడుతూ బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన జగనన్నకు అండగా నిలవాలని కోరారు. ఎమ్మెల్యే ఆళ్ల నాని చొరవతో తమ సంఘీయులు సాధించుకున్న 600 గజాల స్థలంలో సంఘం భవన నిర్మాణానికి తన వంతు సహకారం ఉంటుందన్నారు. మరడా అనిల్ కుమార్, కిలాడి దుర్గారావు మాట్లాడుతూ కొప్పుల వెలమలకు జిల్లాలో అత్యున్నత జెడ్పీ చైర్‌పర్సన్ పదవిని ఇచ్చి గౌరవించిన సీఎం జగనన్నకు, ఎమ్మెల్యే ఆళ్ల నానికి కృతజ్ఞతలు తెలిపారు. న్యాయవాది బొంగు అచ్యుతరావు మాట్లాడుతూ పార్టీకి అండగా నిలిచిన ఘంటా ప్రసాదరావు ద్వారా కొప్పుల వెలమ సంఘానికి మంచి గుర్తింపు వచ్చిందన్నారు. గొట్టాపు మోహన్, కోట ఈశ్వర దత్తు, బళ్ల శ్రీను, బొమ్మి శేషు, తెంటు సూర్యనారాయణ, పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణానికి 'ఆశ్రయం' చేయూత

దెందులూరు: జగనన్న ఇళ్ల నిర్మాణానికి స్వచ్ఛంద సేవా సంస్థ ఆశ్రయం ఇన్‌ఫ్రా ప్రాజెక్టు ప్రైవేటు లిమిటెడ్ చేయూతనిస్తోంది. సీఎంఓ కార్యాలయం అధికారులు ఆశ్రయం సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అరుణ్ భవాని తొండూరును కలిసి జగనన్న ఇళ్ల నిర్మాణానికి చేయూత అందివ్వాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయానికి తోడ్పాటు అందించాలని కోరారు. ఈ నేపథ్యంలో ఆశ్రయం సంస్థ ఆశయాలకు అనుగుణంగా దెందులూరు మండలం సీతంపేట పంచాయతీ కొమిరేపల్లిలో పేదలకు స్వచ్ఛందంగా 15 మంది గిరిజన లబ్ధిదారులకు మొదటి విడత ఇళ్లను నిర్మిస్తోంది. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అరుణ్ మాట్లాడుతూ దారిద్ర్యరేఖకు దిగువ ఉన్న పేదలకు నివసించడానికి పూర్తి భద్రత లక్ష్యంగా తాము తమ సంస్థ తరపున ఇళ్లు నిర్మిస్తున్నట్టు తెలిపారు. ఒక బెడ్‌రూమ్, హాల్, కిచెన్‌తో ఇంటిని నిర్మిస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే రూ. 1.80 లక్షలతో పాటు లబ్ధిదారుడు రూ. 30 వేలు ఇంటికి ఖర్చు పెడుతున్నారు. వీటికి అదనంగా దాత, మేనేజింగ్ డైరెక్టర్ అరుణ్ ఒక్కొక్క ఇంటికి రూ. 50 వేలు వెచ్చించి నిర్మాణం పూర్తి చేయనున్నారు. దీంతో కొమిరేపల్లి, సీతంపేట పంచాయితీలో జగనన్న ఇళ్ల లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, సర్పంచ్ పరసా లక్ష్మి సుజాత, గ్రామ పార్టీ అధ్యక్షుడు కోటిపల్లి సురేష్, ఎంపీటీసీ పులవర్తి వరమణి, పార్టీ జిల్లా కార్యదర్శి పులవర్తి సంతోష్, వైఎస్సార్‌సీపీ కన్వీనర్ రాజు, ఆశ్రయం సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌కు, రాష్ట్ర ప్రభుత్వానికి కొమిరేపల్లి జగనన్న ఇళ్ల లబ్ధిదారుల తరపున కృతజ్ఞతలు చెబుతున్నారు.


కొమిరేపల్లిలో జగనన్న కాలనీలో నిర్మిస్తున్న ఇళ్లు

పేదలకు సొంతిల్లు నిర్మాణం జగనన్న లక్ష్యం



పేదలందరికీ నివాసం, భద్రత కల్పించడం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం. ఇళ్ల నిర్మాణ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా కొత్త గ్రామాల సృష్టికర్తగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే కీర్తి ప్రతిష్టలు పొంది చరిత్ర సృష్టించారు.

– కొఠారు అబ్బయ్యచౌదరి, దెందులూరు ఎమ్మెల్యే

జగనన్న కాలనీల నిర్మాణానికి సాయం



గూడు లేని పేదలు నివసించడానికి రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఇళ్ల నిర్మాణ పథకం ఆదర్శనీయం. సీఎంఓ కార్యాలయం సమన్వయంతో తమ సంస్థ తరపున 15 మంది నిరుపేదలైన లబ్ధిదారులకు ఆర్థికసాయం అందించాం. పేదలకు భద్రత కల్పించే దిశగా ప్రభుత్వం కృషిచేయడం హర్షణీయం.

– అరుణ్ భవాని, కొండూరు, ఆశ్రయం ఇన్‌ఫ్రా ప్రాజెక్టు, ఎండీ

పేదలను ఆదుకున్న గొప్ప మనిషి సీఎం జగన్



సొంతిల్లు లేకుండా ఊరి బయట భద్రత లేకుండా ఉన్న ఎంతో మందికి ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి రుణం మంజూరు చేసి పేద కుటుంబాల్లో సీఎం జగన్ దేవుడయ్యాడు. పేదల కష్టం చూసిన గొప్ప మనిషి ముఖ్యమంత్రి జగన్.

– రాపాక సాయమ్మ, లబ్ధిదారురాలు, కొమిరేపల్లి

నేడు పాతముప్పర్రులో గడపగడపకు మన ప్రభుత్వం

పెదపాడు: పాతముప్పర్రులో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పెదపాడు మండల కన్వీనర్ అప్పన ప్రసాద్ తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 9 గంటల వరకు జరిగే ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పాల్గొని ప్రజలకు ప్రభుత్వం అందించిన పథకాలను వివరిస్తూ, సమస్యలను అడిగి తెలుసుకుంటారని చెప్పారు. ఈకార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల నాయకులు కార్యకర్తలు పాల్గొనాలని చెప్పారు.

నేడు రావులపర్రు, కాగుపాడులో 'జగనన్న సురక్ష'

ఉంగుటూరు: జగనన్న సురక్ష సమావేశాలు సోమవారం రావులపర్రు, కాగుపాడు గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఆంజనేయులు తెలిపారు. ఈ సమావేశాలకు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు హాజరవుతారని ఆయన తెలిపారు. వారం రోజులుగా ఆగ్రామాల్లో ఇవ్వాల్సిన సర్టిఫికెట్లు సర్వే ద్వారా గుర్తించి పంపిణీ చేస్తామని ఆయన చెప్పారు. మండలంలోని అధికార్లు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని ఆయన కోరారు.

ప్రజలకు చేరువగా ప్రభుత్వ సేవలు

పెదవేగి : గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అన్ని ప్రభుత్వ శాఖలు అందుబాటులోకి తెచ్చి వారికి మెరుగైన సేవలు ఒకే చోట అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పంచాయతీల్లో సచివాలయ వ్యవస్థను తెచ్చిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. పెదవేగి మండలం పెదకడిమిలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గ్రామ సచివాలయ భవనాన్ని, రూ.22 లక్షల వ్యయంతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.17.50 లక్షలతో నిర్మించిన హెల్త్‌క్లినిక్‌లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నిటినీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నెరవేరుస్తోందని అన్నారు. పెదకడిమిలో అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువయ్యేలా చేశామని అన్నారు. అర్హులందరికీ ఇల్లు, పథకాలు మంజూరు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచ్‌లు, కొప్పాక సొసైటీ అధ్యక్షుడు చళ్ళగొళ్ళ భూస్వామి, పర్వతనేని నాగయ్య, పర్వతనేని కృష్ణారావు, చలసాని వెంకటరావు, నందిగాం శ్రీనివాసరావు, కొల్లి రాజేష్‌బాబు, అన్నపనేని పెదబాబు, గోళ్ళ మంగయ్య, నెరుసు వెంకటసత్యనారాయణ, ఇతర నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


గ్రామ సచివాలయ భవనాన్ని స్థానిక నాయకులతో కలిసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యత

నిడమర్రు: రాష్ట్ర ప్రజల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. ఆదివారం బువ్వనపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నిడమర్రు గ్రామానికి చెందిన కన్నాజి మహాలక్ష్మికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.4 లక్షల చెక్కును ఎమ్మెల్యే అందించారు. కన్నాజి మహాలక్ష్మి ఇటీవల అనారోగ్యంతో శస్త్ర చికిత్స చేయించుకోవడంతో ఆ చెక్కును ఆమె కుటుంబ సభ్యులకు అందించారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో అనేక మందికి సీఎం రిలీఫ్ ఫండ్ ఆసరాగా నిలిచిందన్నారు. అనంతరం మహాలక్ష్మి కుటుంబ సభ్యులు సీఎం జగన్ మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కోడే కాశి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు, వైసీపీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్, మండల ఆర్‌బీకే చైర్మన్ పోలిశెట్టి రమేష్ తదితరులున్నారు.


కన్నాజి మహాలక్ష్మి కుటుంబ సభ్యులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

వ్యక్తిగత, పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

పెదవేగి : వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతతో అందరూ ఆరోగ్యంగా ఉండవచ్చని భోగాపురం సర్పంచ్ దిమ్మిటి నాగమల్లేశ్వరి అన్నారు. ఆదివారం పెదవేగి మండలం భోగాపురంలో వికాస్ సమితి ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. దళితవాడలో, భోగాపురం, మడిచర్ల రహదారి ఇరువైపులా శుభ్రం చేశారు. గ్రామంలో ప్రజలకు పరిసరాలపై అవగాహన కలిగేలా రహదారులను శుభ్రం చేసి, చెత్తను కాల్చివేశారు. ఆంధ్ర రాష్ట్ర గ్రామ వికాస్ ప్రముఖులు తిరుపతయ్య, ఏలూరు జిల్లా సభ్యులు బాబూరావు, ఏలూరు కండ గ్రామ వికాస్ సభ్యుడు దిమ్మిటి రమేష్, ప్రకృతి వ్యవసాయ సభ్యులు పి సరోజిని, ఐసీఆర్‌పీ సభ్యులు ఎస్ రంగారావు, ఎస్ సత్తిబాబు, రంగయ్య, భోగాపురం గ్రామ వికాస్ సభ్యులు గోళ్ళ సత్యనారాయణ, అబ్బదాసు శ్రీనివాసరావు, బోళ్ల లక్ష్మీనారాయణ, రాజవరపు చినవెంకయ్య పాల్గొన్నారు.


భోగాపురంలో రహదారికి ఇరువైపులా చెత్తను శుభ్రం చేస్తున్న వికాస్ సమితి సభ్యులు

ఉత్సాహంగా 'చదవడం మాకిష్టం'


భీమడోలు శాఖా గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న చిన్నారులు


పెదవేగి పుస్తక పఠనంలో నిమగ్నమైన విద్యార్థులు

భీమడోలు: గ్రంథాలయాలు జ్ఞాన సముపార్జన నిలయాలని పలువురు వక్తలు అన్నారు. మండలంలోని భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలలకు చెందిన బాలబాలికలు పాల్గొని సామూహిక పుస్తక పఠనం చేసారు.ఈ కార్యక్రమంలో పూళ్ల, గుండుగొలను గ్రంథపాలకులు డీఎస్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి, పెద్దలు మోహనరావు, పాఠకులు, చిన్నారులు పాల్గొన్నారు.

గ్రంథ పఠనంతో విజ్ఞానం

పెదవేగి : గ్రంథ పఠనంతో విజ్ఞానం వృద్ధి చెందుతుందని పెదవేగి శాఖాగ్రంథాలయ గ్రంథపాలకుడు తోట అరుణకుమార్ తెలిపారు. పెదవేగిలోని శాఖ గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. గ్రంథపాలకుడు చిన్నారులకు గ్రంథ పఠనం ద్వారా కలిగే లాభాలను వివరించారు. ప్రతి విద్యార్థి చిన్నతనం నుంచే విజ్ఞానదాయకమైన పుస్తకాలను చదవడం ద్వారా భవిష్యత్తును ఉన్నతంగా మార్చుకునే వీలుంటుందని ఆయన చెప్పారు.

రాట్నాలమ్మకు శాకంబరి అలంకరణ

పెదవేగి : శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన రాట్నాలమ్మ తల్లిని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆదివారం పెదవేగి మండలం రాట్నాలకుంటలో కొలువైన రాట్నాలమ్మకు శాకంబరి అలంకరణ చేశారు. జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వారం రాట్నాలమ్మకు పూజా టికెట్లపై రూ.51,960, విరాళంపై రూ.5,616, లడ్డూ ప్రసాదంపై రూ.34,665, ఫొటోల అమ్మకంపై రూ.1,909, మొత్తం అమ్మవారికి వివిధ రూపాల్లో రూ.94,150 ఆదాయం లభించిందని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్ సతీష్ తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవస్థాన చైర్మన్ చల్లగొళ్ళ వెంకటేశ్వరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


రాట్నాలమ్మకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

కాపు కల్యాణ మండపంలో మరిన్ని అభివృద్ధి పనులు

ద్వారకాతిరుమల : కాపు కల్యాణ మండపం క్షేత్రంలో వివాహాలు చేసుకునే అన్ని కులాల వారికీ అందుబాటులో ఉంటుందని కల్యాణ మండప ట్రస్ట్ చైర్మన్, ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. స్థానిక శ్రీ వేంకటేశ్వర శ్రీకృష్ణ దేవరాయ వెల్ఫేర్ ట్రస్ట్ సర్వసభ్య సమావేశం వాసుబాబు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. కల్యాణ మండప అభివృద్ధిపై ట్రస్టు సభ్యులు చర్చించి, పలు అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. 2022–2023 వార్షిక బడ్జెట్‌ను ఆమోదించారు. కల్యాణ మండపంలో వివాహాలు చేసుకునే వారికి మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్టు వాసుబాబు చెప్పారు. ప్రధాన కల్యాణ మండప సముదాయంలోని శ్రీ ఆంజనేయ మినీ కల్యాణ మండపాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. కల్యాణ మండపం వర్కింగ్ ప్రెసిడెంట్ చిన్నమిల్లి వెంకటరాయుడు, ట్రెజరర్ మాకా శ్రీనివాసరావు, స్థలదాత పెద్దిరెడ్డి వేణుగోపాలకృష్ణారావు పాల్గొన్నారు.

అప్పారావు సేవలు ఎనలేనివి

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో రజకుల వృత్తి చెరువు, మహిళలపై దాడులను అరికట్టేందుకు కృషి చేసిన కోరంగి అప్పారావు సేవలు ఎనలేనివని రజక జన సంఘం జిల్లా అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య అన్నారు. స్థానిక రజక జనసంఘం జిల్లా కార్యాలయంలో కోరంగి అప్పారావు వర్ధంతి కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కట్లయ్య మాట్లాడుతూ రజకుల సమస్యల కోసం అప్పారావు చేసిన పోరాటాలు స్ఫూర్తిదాయకమన్నారు. జిల్లాలోని అనేక గ్రామాల్లో రజకుల వృత్తిచెరువుల విషయంలో వివాదాలు తీర్చారని గుర్తు చేశారు. అప్పారావు అడుగు జాడల్లో రజకుల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా రజక సంఘం సీనియర్ నేతల చిల్లంతరావుల కృష్ణ, దొడ్డిపట్ల బ్రహ్మయ్య, చిన్నాయగూడెం నాంచారయ్య, దేవరపల్లి భద్రయ్య, కడెల్లి సుబ్బయ్య, సంపర సుబ్బారావు, బూరుగుపల్లి సత్యనారాయణ, తూటిగుంట దుర్గారావు, బొండాడ సింహాద్రి, భీమవరపు మహంకాళి, జాలిపూడి శేషు, కొవ్వలి వెంకటేశ్వరరావు, పడమటి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

పెదవేగి : కుటుంబంలో ఓ వ్యక్తిని కోల్పోవడం ఎవ్వరూ తీర్చలేని బాధని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆదివారం అన్నారు. పెదవేగి మండలం కొండలరావుపాలెం గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు, బిల్లగూడి సామ్యూలు ఆదివారం మరణించగా ఆయన భౌతిక కాయానికి ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కొండలరావుపాలెంలో బచ్చల జయరాజు కుమార్తె ఇటీవల మరణించగా, వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. విజయరాయిలో మోదుగుమూడి సావిత్రమ్మ సంతాప సభలో పాల్గొని ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు.

బ్రాహ్మణుల అభివృద్ధికి కృషి


బ్రాహ్మణ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): బ్రాహ్మణుల అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నట్టు శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సమితి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు తోలేటి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం స్థానిక రామచంద్రరావుపేట శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థాన కల్యాణ మండపంలో నిర్వహించిన సంఘం జిల్లా కార్యవర్గ విస్తృత స్థాయి సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. భావ సారూప్యం గల సంఘాలను తమ సంఘ పరిధిలోకి తీసుకొచ్చి బ్రాహ్మణులకు మరింత సేవా కార్యక్రమాలు అందుబాటులోకి తెస్తామన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్ మనుగడకు ఏడాదికి రూ.500 కోట్ల నిధులు విడుదల చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సంఘం కార్యదర్శి కాశీభొట్ల పార్వతీశ్వర శర్మ మాట్లాడుతూ పేద బ్రాహ్మణ వధూవరులకు కల్యాణమస్తు పథకం కింద వివాహానికి ప్రభుత్వం సహకరించాలని, గరుడ పథకం కింద పేద కుటుంబంలో బ్రాహ్మణులు చనిపోతే వారి కుటుంబ అవసరాల నిమిత్తం ఆర్థిక సాయం రెట్టింపు చేయాలని కోరారు. ఈ సందర్భంగా 2022–23 విద్యా సంవత్సరంలో 10వ తరగతి, ఇంటర్మీడియట్లలో 90 శాతానికి పైగా మార్కులు సాధించి ఉత్తీర్ణులైన 45 మంది బ్రాహ్మణ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం, సర్టిఫికెట్, జ్ఞాపిక అందించి అభినందించారు. కార్యక్రమంలో సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు బుద్ధవరపు సుబ్బారావు, కోశాధికారి అమ్మనమంచి మురళీకృష్ణ, ఉపాధ్యక్షుడు అనిపెద్ది రామకృష్ణ, యువజన అధ్యక్షుడు మాగి సంతోష్, ఏలూరు బ్రాహ్మణ ఐక్య కార్యాచరణ వేదిక అధ్యక్షుడు టీఆర్ శర్మ, అఖిల భారత బ్రాహ్మణ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు ఎంబీఎస్ శర్మ, ద్రోణంరాజు వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

12న ఎంఆర్‌పీఎస్ జాతీయ సమావేశం

ఏలూరు (టూటౌన్): ఈ నెల 12న వరంగల్‌లో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ జాతీయ సమావేశం నిర్వహించనున్నట్టు ఎంఆర్‌పీఎస్ జిల్లా నాయకులు బయ్యారపు రాజేశ్వరరావు తెలిపారు. ఎంఆర్‌పీఎస్ జిల్లా కోఆర్డినేటర్ కాశీకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక గన్‌బజార్ సెంటరులో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ ముఖ్య నాయకుల సమావేశం ఆదివారం నిర్వహించారు. రాజేశ్వరరావు మాట్లాడుతూ జాతీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. కాశీకృష్ణ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ ఎస్సీల్లో ఉన్న 59 ఉపకులాలకు 15 శాతం రిజర్వేషన్‌ను దామాషా ప్రకారం సమానంగా కేటాయించాలన్నారు. ఎస్సీ సంక్షేమ నిధులు కేటాయించాలని కోరారు.

ఉంగుటూరులో నిత్యం ట్రాఫిక్ ఇక్కట్లు

ఉంగుటూరు: టోల్ గేటును తప్పించుకునేందుకు వాహనదారులు ఉంగుటూరు రోడ్ల మీదుగా రాకపోకలు సాగించడంతో గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. ఊళ్లోకి వచ్చే వాహనాలను నిరోధించాలని వారు కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీని వల్ల నిత్యం ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవడంతోపాటు ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు తెలిపారు. ఈ నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే వాసుబాబు దృష్టికి ప్రజలు ఈ సమస్యను తీసుకువెళ్లారు. ఇటీవల గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ టోల్ గేటు నుంచి వెళ్లకుండా గ్రామంలోకి వచ్చే వాహనాలను నిరోధించేలా అడ్డంగా గడ్డర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. భారీ వాహనాలు ఊరిలోకి రాకుండా పంచాయతీలో తీర్మానం చేయాలని ఆదేశించారు. అయితే దీనిపై గ్రామ పంచాయతీలో కదలిక కనిపించలేదు.